
**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం**

# అంత్యరోదన

డా. కొఠారి వాణీచలపతిరావు

గడపదాటి ఇంట్లోకి అడుగుపెడుతుంటే కాళ్ళు సన్నగా వణికాయి సత్యమూర్తికి...గుండె దడదడలాడింది. మనసు సిగ్గుతో, అవమానంతో కుచించుకుని పోయింది. తన ఇంటికే తను అలాంటి పరిస్థితిలో రావడం ఆశ్చర్యాన్నే కాదు...చిరాకును, కోపాన్ని కూడా కలిగిస్తున్నాయి అతనికి.

తలుపు ఓరవాకిలిగా తీసివుండటం వల్ల బెల్ కొట్టాల్సిన అవసరం రాలేదు. భార్య దుర్గకు ఎదురుపడాలంటే భయం...భయంగా ఉంది సత్యమూర్తికి. ఇక కూతురు కీర్తి గుర్తుకొస్తేనే ఎలా ఫేస్ చేయాలా అన్న భయం పట్టి పీడించటం మొదలుపెట్టింది.



ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.తుఫాను రాబోయే ముందటి ప్రశాంతత కావచ్చు అది! మధ్య హాల్లో వాలు కుర్చీలో కూర్చుని ముఖానికి చెయ్యి అడ్డం పెట్టుకుని...నిద్రపోతున్నదో లేక దీర్ఘంగా ఆలోచిస్తున్నదో తెలియని స్థితిలో ఉన్న దుర్గను చూసి మెల్లగా అడుగులో అడుగేస్తూ తన గదిలోకి వెళ్ళబోయాడు సత్యమూర్తి.ఆపాటి అలికిడికే దిగ్గున లేచి కూర్చుని....ఒక్కసారి భర్తవంక నిరసనతో చూసి ముఖం అటు తిప్పుకుని "వచ్చారా..మీరు మళ్ళీ వస్తారని అనుకోలేదు. ఏ ముఖం పెట్టుకుని వచ్చారు. సిగ్గులేదూ?" అంది తీవ్ర స్వరంతో. దాంతో వాళ్లు ఆ దృశ్యాన్ని టీ.వీలో చూసారని అర్థమైపోయింది సత్యమూర్తికి. "అదుకాదు దుర్గా...!"

"మీరు నాతో మాట్లాడారంటే నా మీద ఒట్టే!"

"నీకు అసలు విషయం...."

"మీరు నాకే విషయాలూ చెప్పనక్కరలేదు. టీవీ ఎక్స్ ఛానెల్ వాళ్లు కళ్లకు కట్టినట్టు మరీ మీ బాగోతం అంతా చూపించారు. సిగ్గుతో చితికిపోయాను. ఇంకా ఎంతమంది ఆ ఛానెల్‌ను చూసి ఉంటారో...ఎంత బాగా మన పరువు ప్రతిష్ఠలు బజారున పడి ఉంటాయో! మీరు ఇలాంటి మనిషని నేను కలలో కూడా అనుకోలేదు. నోట్లో వేలు పెట్టినా కొరకలేనంత మంచి మనిషిగా పైకి కనిపించే మీలో ఇంత ఛండాలం దాగుందా?" అని అంటుండగానే కూతురు కీర్తి తన గదిలో నుండి బయటకు వచ్చింది వేగంగా.

తండ్రి కనిపించగానే "ఛీ..!ఛీ...!" అంటూ వేగంగా గదిలోకి వెళ్ళింది.

"అమ్మా! కీర్తి...!" అంటూ గుమ్మం వరకు వెళ్ళిన సత్యమూర్తికి ముఖాన్నే తలుపులేసేసింది.


కళ్లలో తీవ్ర కోపాన్ని ఎగజిమ్ముతూ "మీ నిర్వాకాన్నంతా ఇప్పటిదాకా మైకు పెట్టుకుని మరీ ఎక్స్ టీవీ ఛానెల్‌తోపాటు మిగతా ఛానళ్ళన్నీ కూడా కట్టగట్టుకుని పదే పదే రివైండ్ చేస్తూ మరీ చూపిస్తున్నాయి. ఇక చూడలేక టీవీ బంద్ చేసాను. ఇదిగో మీరూ చూడండి..." అంటూ టీవీని రిమోట్‌తో ఆన్ చేసి భద్రకాళిరూపంతో నడుమున చెయ్యిపెట్టుకుని అక్కడే నిల్చుండిపోయింది. దుర్గను అంత కోపంగా ఎప్పుడూ చూడలేదు సత్యమూర్తి.

"చెప్పేవి శ్రీరంగనీతులు...దూరేది సానికొంపలు అన్నట్టు పేరుకు సత్యమూర్తి మీరు! కానీ మీ నిలువెల్లా అసత్యమే. పనిపేరుతో ఆఫీసుకెళ్ళి మీరు చేసే పాపపు పనులు ఇవా? హవ్వ!! మీకయితే ఎలాగూ సిగ్గులేదు. నేను ఇక వీధిలో ఎలా తలెత్తుకుని తిరగగలనండీ!" అంది దుర్గ ఛీత్కారంతో. ఆన్ చేసిన టీవీలోనుంచి యాంకర్ గొంతు పెద్దగా వినిపిస్తోంది.

"అదిగో...నేను చెప్పలేదూ- మీ గురించే చూపిస్తున్నారు. చూసి...తరించండి!" అని దుర్గ అనగానే 'ప్రభుత్వ ఆఫీసులో అసిస్టెంట్ ఇంజనీర్ సత్యమూర్తి రాసక్రీడలు...హెడ్‌క్లర్క్ లక్ష్మితో పట్టపగలే రికార్డు రూమునే బెడ్ రూమ్ చేసుకుని సాగించిన శృంగారం!' అంటూ సత్యమూర్తి రికార్డ్‌రూమ్‌లో నిల్చుని ఉండటం, అదే టైములో లక్ష్మి ఆ రూమ్‌లోనుంచి బయటకు రావడం...చూపిస్తూ...దానికి చిలవలు, పలవలు అల్లి...పదే పదే రివైండ్ చేస్తూమరీ చూపిస్తున్నారు. ఆ దృశ్యం అసలు టీవీ ఛానెల్‌కు ఎలా వెళ్ళిందో...ఎవరు షూట్ చేసారో...అంతా అయోమయంగా ఉంది సత్యమూర్తికి. ఆ మర్నాడు ఆదివారం కావటంతో ఓ ఫ్రెండ్ ఇంటికి వెళ్ళాడు. ఇద్దరూ కలిసి టీ తాగుతూ టీవీ చూస్తుంటే ఉన్నట్టుండి 'రాసలీలలు' అంటూ ఆ క్లిప్పింగ్స్ తెరమీదకు వచ్చింది. ఆశ్చర్యంతో అదిరిపడ్డాడు సత్యమూర్తి. అయోమయంగా, అనుమానంగా సత్యమూర్తి వంకకు చూసాడు ఆ మిత్రుడు. దాంతో ఖంగారుపడి "అదంతా అబద్ధంరా. వాళ్ళు చెబుతున్నది నిజంకాదు-నన్ను నమ్మరా!" జరిగిందంతా చెప్పాడు సత్యమూర్తి.


"నువ్వు చెప్పింది నిజమే అయి ఉండవచ్చునని నేను నమ్ముతున్నాను. కానీ ఈ లోకాన్ని ఎలా నమ్మించగలవ్? ఈపాటికే ఎంతోమంది చూసుంటారు. ఒకళ్ళకొకళ్ళు ఫోన్లు చేసుకుని చూడనివారికి కూడా చూపించి ఉంటారు. ఇప్పుడు ఎలారా? నీ భార్యా పిల్లలు ఈ దృశ్యాలను చూసారంటే తట్టుకోగలరా? నిన్ను అసహ్యించుకోరూ!" అన్నాడు ఆత్రంగా.

అలా అనగానే "నేను ఇంటికి వెళ్ళాలి!" అంటూ లేచాడు సత్యమూర్తి. "ముందు టీవీ ఛానల్ ఆఫీసుకెళ్ళి జరిగిన విషయం చెప్పు. ఆధారాలేమయినా నువ్వు చూపించగలిగితే టెలికాస్ట్ ఆపేస్తారేమో!" అనగానే అటు పరుగులు తీసాడు సత్యమూర్తి. అక్కడ కనబడ్డ వాళ్ళందరికీ విషయం వివరించి మొరపెట్టుకున్నా విన్న నాథుడే లేడు. అరణ్యరోదనలా మారింది తన గోడు! దాంతో వెనుదిరిగి మనోవేదనతో, అసలటతో, తీవ్ర నిస్సత్తువతో ఇంటికి చేరుకుంటే ఇక్కడ లభించిన స్వాగతం ఇదీ! అనుకుంటుండగ గదిలోనుంచి తొంగి చూస్తూ కీర్తి "అమ్మా...ఆ టీవీ బంద్ చెయ్! నేను సిగ్గుతో చచ్చిపోతున్నాను ఇక్కడ! ఇప్పటికే మా ఫ్రెండ్స్ అంతా ఫోన్ చేసి మీ నాన్న టీవీలో కనిపిస్తున్నాడు...ఫలానా .చానెల్‌లో...అని ఒకటే ఫోన్లు"



## త్వరలో కలుస్తాను

బాలీవుడ్ హీరోయిన్ విద్యాబాలన్, ప్రియమణి కజిన్స్ అన్న విషయం ఈమధ్యనే తెలిసింది. తమ బంధుత్వం గురించి వివరిస్తూ 'తానింత వరకూ ప్రియమణిని కలవలేదనీ, ఆమె నటించిన చిత్రాలేవీ చూడలేదని' చెప్పింది విద్యాబాలన్. తామిద్దరం కజిన్స్ అన్న సంగతి నిజమేననీ, సాధ్యమైనంత త్వరలో ప్రియమణిని కలసి తనతో మాట్లాడాలనుకుంటున్నట్లు చెబుతోంది విద్యాబాలన్.



అంటూ విసురుగా తలుపేసుకుని మళ్ళీ లోపలికి వెళ్ళిపోయింది. దాంతో హతాశుడయిన సత్యమూర్తి భార్య దుర్గవంక చూస్తూ "దుర్గా! ప్లీజ్ నేను చెప్పింది విను. ఒక్కసారి ప్లీజ్!" అంటూ బ్రతిమిలాడాడు.

"మీరు ఏం చెబుతారు...నన్నేం వినమంటారు. ప్రత్యక్ష ప్రసారంలా మీ రంకును వాళ్ళంత స్పష్టంగా చూపిస్తుంటే..నేనలా చేయలేదు...నువ్వు నన్ను అపార్థం చేసుకుంటున్నావు అని బొంకడానికీ, విషయాన్ని మసి బూసి మారేడు కాయ చేయడానికీ ఇంకా ఏం మిగిలివుందని? మీ మదపిచ్చిని డప్పుకొట్టి మరీ ఆ ఛానెల్‌వాళ్ళు ఆంధ్ర ప్రదేశ్ అంతా వినిపించేలా చాటింపు వేస్తున్నారు. ఇంట్లో పెళ్ళి కావల్సిన పిల్లవుంది. తండ్రి తిరుగుబోతు అని తెలిస్తే ఇక ఆ పిల్లను పెళ్ళెవరు చేసుకుంటారు...?" అంటూ గంట మోగించినట్లు విరామం లేకుండా గణగణా మాట్లాడుతున్న భార్య దుర్గను చూసి సహనం నశించి, చిరాకు, రోషం'లో'నుంచి తన్నుకుని రాగా "దుర్గా!" అంటూ గట్టిగా కేకపెట్టాడు సత్యమూర్తి.ఆ అరుపుకు ఠక్కున దుర్గ నోరు మూతపడిపోయింది. కీర్తి తలుపు తీసుకుని ఒక్క పరుగున బయటకి వచ్చి అని ఆశ్చర్యంతో అలాగే చూస్తుండిపోయింది.

అంత ఉగ్రరూపంలో భర్తను అదే చూడటం! జరిగిందానికి సిగ్గుపడాల్సింది పోయి అలా ఎందుకు రంకె వేసాడో అర్థం కాలేదు ఆమెకు!

"ఊరుకుంటుంటే మరీ రెచ్చిపోతున్నావ్...ముప్పయ్యేళ్ళ మన సంసారంలో నువ్వు నన్ను అర్థం చేసుకుంది ఇదేనా! టైమ్ బాగోలేక నేనో ఆపదలో చిక్కుకుంటే సహకరించాల్సిందిపోయి నువ్వూ పరాయిదానిలా నన్ను అవమానిస్తావా? ఇదేనా ఇన్నాళ్ళ మన దాంపత్యానికి ఫలితం? దుర్గా! నువ్వు నమ్మినా నమ్మకపోయినా అక్కడ జరిగింది చెబుతాను విను! ఆఫీసులో నా కుర్చీలో నేను కూర్చుని సీరియస్‌గా పని చేసుకుంటుండగా నా ఎడం పాదంమీద ఏదో సరసరా పాకుతున్నట్టు అనిపించింది. చటుక్కున లేచి చూసుకునే సరికీ అది నా మోకాలును దాటి వెళ్ళిపోయింది. దాంతో...ఖంగారుపడి...చటుక్కున దగ్గరలో ఉన్న రికార్డు రూమ్‌లోకి పరుగెత్తాను. అక్కడ సామాన్యంగా ఎవ్వరూ ఉండరు. అందుకే అలమారా చాటుకెళ్ళి గబగబా ప్యాంటు విప్పేసి దులిపితే ఇంత పొడుగున ఉన్న జెర్రి ఒకటి కిందపడి జరజరా పాక్కుంటూ అక్కడ గోడకున్న చిన్న రంధ్రంలోకి వెళ్ళిపోయింది. మళ్ళీ ప్యాంటు వేసుకోబోతుండగా...అక్కడే ఒక అలమారాలోనుంచి ఏదో ఫైలు తీసుకుంటూ మా హెడ్ క్లర్క్ లక్ష్మి కనిపించింది. నన్ను చూసి ముందు కంగారుపడి...ఆ తరువాత 'సారీ' చెప్పి అక్కడి నుంచి వెళ్ళిపోయింది. ఆ వెనకే ప్యాంటు జిప్ పెట్టుకుంటూ నేను బయటికి వచ్చాను. అక్కడి నుండి ఇదంతా గమనించిన ఏ టీవీ జర్నలిస్టో లక్ష్మి రికార్డు రూమ్‌లోకి పోగానే...నేనూ కావాలనే అక్కడికి వెళ్ళానని అనుకుని ఫాలో అవుతూ వచ్చి కెమెరా ఆన్ చేసి ఉంటాడు. దానికి చిలవలు పలవలు అల్లి...సెన్సేషన్ క్రియేట్ చేసి మా ఒక్క ఛానలే ఈ విషయాన్ని కనిపెట్టి పెద్ద ఘనకార్యం చేసిందంటూ 'ఎక్స్‌క్లూజివ్' అని వేసుకుని సంబరపడిపోయుంటారు. ఛానళ్ల మధ్య రగులుతున్న ఈ నిరంతర నిప్పు ఎంతమంది పరువు ప్రతిష్ఠలనో క్షణాల్లో కాల్చేస్తోందన్న విషయం వాళ్ళకూ తెలుసు. అయినా వాళ్ళది సీరియస్‌గా తీసుకోరు...వాళ్ళకు కావల్సింది సెన్సేషనల్ న్యూస్...ఆ న్యూస్‌ను చూస్తూ ఎగ్జయిట్‌మెంట్‌తో ఆ టీవీ ఛానెల్‌కు అతుక్కుపోయే ప్రేక్షకులు 'ఫలానా టీవీ ఛానల్‌వాళ్ళు ఇన్వెస్టిగేటివ్ జర్నలిజంలో దిట్టలు...లోలోపల జరిగే బాగోతాలను భలేగా బట్టబయలు చేస్తూ తెరకెక్కిస్తారు' అన్న ప్రశంస! ప్రభుత్వ అధికారుల, రాజకీయనాయకుల వ్యక్తిగత జీవితాల్లోకి తొంగిచూసి...ఉన్నవీ లేనివీ కల్పించి బజారుకీడ్చడమే వాళ్ల పని...ఇలాంటి వికృత, జుగుప్సాకర చర్యలమీద ఎవరి నియంత్రణా లేదు...చెకింగ్ అధికారులూ ఎవ్వరూ లేరు..అంతా ఇష్టారాజ్యం. నాబోడివాడెవడయినా 'ఇది అన్యాయం...ఇది అక్రమం.. ఇది అకారణ అభాండం' అని గొంతెత్తుకుని అరిచినా అది అరణ్యరోదనేగానీ వినే నాధుడు ఉండడు" అన్నాడు సత్యమూర్తి ఆవేదనగా.అంతవరకూ చిత్తరువులా అలాగే నిల్చుండిపోయిన దుర్గ కళ్లల్లో పశ్చాత్తాపంతో కన్నీళ్లు నిలిచాయి. జాలిగా భర్త వంక చూసింది.అదంతా విన్న కీర్తి "సారీ డాడీ ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ" అంది బాధగా మనసులోనే. ఇంతలో టెలిఫోన్ రింగ్ అవడంతో దాని దగ్గరే నిల్చున్న సత్యమూర్తి రిసీవర్ ఎత్తి "హలో" అన్నాడు.

"నమస్కారమండీ...ఏంటి మీరూ చూసారా టీవీ? ఆ...అవును. ఇప్పుడే వస్తున్నాను" అని రిసీవర్ పెట్టేసి భార్యవైపు తిరిగి "మా కొలీగ్ సుబ్బారావుగారు ఫోన్ చేసారు. మా హెడ్‌క్లర్క్ లక్ష్మి ఆత్మహత్య చేసుకబోయిందిట. సీరియస్ కండిషన్‌లో హాస్పిటల్‌లో ఉందిట" అని చెప్పి ఉన్నఫళంగా చకచకా హాస్పిటల్‌కు బయలుదేరాడు ఆందోళనతో సత్యమూర్తి.

★



## స్పేస్ హోటల్

బార్సిలోనాకి చెందిన గేలక్టిక్ స్యూట్ స్పేస్ రిసార్ట్ అనే కంపెనీ బిల్డర్లు 2012 నాటికి అంతరిక్షంలో మొట్టమొదటి హోటల్‌ను నిర్మించనున్నారుట. దాన్ని చేరడానికి రాకెట్‌లో రోజున్నర సమయం పడుతుందిట. అక్కడ మూడు రాత్రులు గడపడానికి 44 లక్షల డాలర్లు వసూలు చేస్తారుట. ఎన్నో బిలియన్ల ఖర్చుతో నిర్మించబోతున్న ఆ హోటల్ భూమి చుట్టూ 80 నిముషాలకొకసారి ప్రదక్షిణం చేస్తుందిట. ఆ హోటల్‌లో ఉండే వారు రోజుకి 15సార్లు సూర్యోదయాన్ని చూస్తారు.

-తటవర్తి

